ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 319
పేజీలు : 5 వెల రూ. 2/-
ఆదివారం
29 మార్చి 2026
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## మూసీలో లక్షన్నర కోట్ల అవినీతి!..



2 లో

# అక్రమాలు తవ్వుతాం



**మైనింగ్ మాఫియాపై సీబీసీఐడీ విచారణ**
**2014 జూన్ 2 నుంచి ఇప్పటి వరకు చేపడతాం**
**సిరిసిల్ల ఇసుక దందా మొదలు మాజీ మంత్రులు, ప్రస్తుత ఎంపీ కంపెనీల అక్రమ లీజులపై దర్యాప్తు**
**ప్రతిపక్షం ఆరోపిస్తున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై కూడా...**
**వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో నివేదికను ప్రవేశపెడతాం**
**శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి**


ఏఎం న్యూస్ / హైదరాబాద్ : తెలంగాణ ఆవిర్భవించిన 2014 జూన్ 2వ తేదీ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన మైనింగ్ మాఫియా అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ చేయిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సిరిసిల్ల ఇసుక దందాలో మాజీ ఎంపీ సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై, గ్రానైట్ అక్రమ మైనింగ్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ కంపెనీపై, మైనింగ్ లీజు మాఫియాలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కంపెనీపై, మాజీ మంత్రి హరీశ్‌రావు తమ్ముడు మహేశ్‌రావు మైనింగ్ దోపిడీపై.. ప్రతిపక్షం ఆరోపిస్తున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పైనా సీబీసీఐడీతో సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. నిక్కచ్చిగా అన్ని విషయాలను నిగ్గుతేల్చి, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి నివేదికను ప్రవేశపెడతామని స్పష్టం చేశారు. గనుల శాఖ పద్దులపై చర్చ సందర్భంగా శనివారం శాసనసభలో అధికార, విపక్ష సభ్యుల మధ్య చోటుచేసుకున్న వాదోపవాదాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో మైనింగ్ అక్రమాలపై 'సభాసంఘం' వేయాలంటూ భారాస ఎమ్మెల్యేలు నినాదాలు చేస్తుండగానే సీఎం తన ప్రసంగాన్ని కొనసాగించారు.

**బెదిరింపులకు భయపడేది లేదు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగినా, ఖనిజ సంపదకు గండికొట్టే తప్పిదాలు చోటుచేసుకున్నా, మా ప్రభుత్వం ఎవరినీ ఉపేక్షించలేదు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అంశంలో.. నిజానికి రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులిచ్చి, చర్యలు తీసుకోమన్నది మా ప్రభుత్వమే. 2025 ఆగస్టు 8న పర్యావరణ ఇంజినీర్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసి.. సీనరేజ్ కింద రూ. 1,52,97,825, పర్మిట్ పన్ను కింద రూ. 1,22,25,446లను ఆ సంస్థ నుంచి ప్రభుత్వమే రాబట్టింది. అయితే ఆ కంపెనీ మా మంత్రివర్గ సభ్యుడికి సంబంధించినదని ప్రతిపక్షాలు చర్చకు దిగాయి. ఇది వాళ్లు కనిపెట్టి ఫిర్యాదు చేస్తే తీసుకున్న చర్య కాదు. ఇక్కడ మంత్రుల పాత్ర ఉందని మాకెవరూ ఫిర్యాదు చేయలేదు. మా ప్రభుత్వమే వివరాలను సేకరించి, ఆ సంస్థకు నోటీసులిచ్చి, దాన్నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను రాబట్టడమే కాకుండా.. 'దీనికి సంబంధించిన అనుమతులను పరిశీలించండి.. చర్య తీసుకోండి' అని అధికారులను ఆదేశించింది. కొందరు ప్రతిపక్ష సభ్యులు కావాలనే వివాదం లేవనెత్తి, ఒక మంత్రిపై బురద మిగతా 2లో..

# మూసీ ప్రక్షాళనకు అడ్డుపడితే శివతాండవమే

**ఎన్ని సమస్యలెదురైనా పూర్తిచేసి తీరతాం**
**ఎన్జీటీలో కేసును వెనక్కి తీసుకోకపోతే వారిని ప్రజలే బహిష్కరిస్తారు: సీఎం రేవంత్‌రెడ్డి**
**రూ.700 కోట్లతో నిర్మించనున్న ఓంకారేశ్వర ఆలయానికి భూమిపూజ**



2 లో

# రాఘువ కన్‌స్ట్రక్షన్స్ బరితెగింపు..

**పొంగులేటి రాజీనామా చేసి విచారణ ఎదుర్కోవాలి : హరీశ్‌రావు**
**నిబంధనలు తుంగలో తొక్కి దర్జాగా దందా**
**జీవో 111 పరిధిలోనే అక్రమంగా స్టోన్ క్రషర్లు**
**కొత్వాల్‌గూడలో కాలుష్య పరిశ్రమలేవీ పెట్టొద్దు**
**కానీ డీజిల్ జనరేటర్లతో భారీ క్రషర్ నడుపుతున్నరు**
**మైనింగ్ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణం**
**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నది**
**కంపెనీ 2 సార్లు పట్టుబడ్డా సర్కార్ మౌనమెందుకు?**
**ధైర్యముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి**
**విపక్ష సభ్యులతో హౌస్ కమిటీ ఏర్పాటు చేయండి**
**పొంగులేటి రాజీనామా చేసి విచారణ ఎదుర్కోవాలి**
**సభలో బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్**
**తాను చెప్పింది తప్పయితే ఉరి తీయాలని సవాల్**

2 లో



# అక్రమాలు తవ్వుతాం..

(మొదటి పేజీ తరువాయి)

చల్లాలని చూస్తున్నారు. వాళ్ల పైరవీలకు మంత్రి సహకరించడం లేదనే అక్కసు, అసూయతోనే ఆయనపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయన్ని బ్లాక్ మెయిల్ చేయాలని ప్రయత్నిస్తున్నారు. వారి బెదిరింపులకు ఈ ప్రభుత్వం భయపడదు. నిజంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో మా మంత్రికి ప్రత్యక్షంగా సంబంధముంటే.. నోటీసులిచ్చి, పన్నుల వసూలు వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటుందా? అసలు ఇలాంటి ప్రయత్నం ఏ ప్రభుత్వమైనా చేస్తుందా? భారాస హయాంలో ఎప్పుడైనా ఇలా చేశారా..." అంటూ నిలదీశారు.

అన్నింటిపైనా విచారణ

"ప్రతిపక్షం వారు అడుగుతున్నట్లుగా.. విచారణకు ఆదేశించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆనాడు సిరిసిల్ల నియోజకవర్గంలోని నేరెళ్లలో ఇసుక బాధితులపై దాడి చేసి.. ఇసుక అక్రమ రవాణా చేసిన సంతోష్‌రావు, వారి తండ్రి రవీందర్‌రావులపై విచారణకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అక్కడ నినాదాలు చేస్తున్న, గతంలో మైనింగ్ శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి.. ఏపీకి చెందిన ఒక మాజీ ఎమ్మెల్యేను బెదిరించి, సర్వే నంబరు 168లోని వాళ్ల మైనింగ్ లీజును రాయించుకొని మరీ అక్రమంగా మైనింగ్ చేశారు. శిరీష జియోగ్రానైట్స్ విషయంలో విచారణ చేయిస్తాం. హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు ఆయన సొంత తమ్ముడు మహేశ్‌రావు అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. వారికి సంబంధించిన 'మిడ్‌వెస్ట్ గ్రానైట్స్'పైనా విచారణకు ఆదేశిస్తాం. మాజీ మంత్రి గంగుల కమలాకర్, వారి కుటుంబ సభ్యులకు సంబంధించి శ్వేత గ్రానైట్స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికే కాదు.. ఈడీ దర్యాప్తు కూడా జరుగుతోంది. ఈ అక్రమ మైనింగ్‌పై విచారణకూ మేం సిద్ధంగా ఉన్నాం.

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు చెందిన గాయత్రి గ్రానైట్స్‌కు నాడు నోటీసులిచ్చి, జరిమానాలు విధించి, వారికి లొంగిపోయాక.. ఆర్బిట్రేషన్‌లో జరిమానాలను మళ్లీ తగ్గించిన తీరుపైన, ఆయన అక్రమ మైనింగ్‌పైనా విచారణ వేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. అదేవిధంగా ప్రతిపక్షం వారు ఆరోపిస్తున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించి కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీబీసీఐడీ విచారణకు నేను ఆదేశిస్తున్నా.

కొల్లగొట్టింది మీరు..

భారాస హయాంలో హరీశ్‌రావు, కేటీఆర్.. రూ.వేల కోట్లను కొల్లగొట్టి, ఇసుక మాఫియాను నడిపారు. ఇప్పుడు మాట్లాడుతున్న ప్రతిపక్ష శాసనసభ్యులు ఇసుక మాఫియాలో, దోపిడీలో భాగస్వాములు. ఇసుక ఆదాయాన్ని పెంచింది మేమే. 2024-25లో ఇసుక ఆదాయం రూ.721 కోట్లు ఉంటే.. 2025-26లో రూ.972 కోట్లు వచ్చింది. అంటే 35% ఆదాయాన్ని పెంచాం. నిర్మాణరంగం కుంటుపడిందని, రియల్ ఎస్టేట్ దెబ్బతిన్నదని వాళ్లే అంటున్నారు. మరి రియల్ ఎస్టేట్ దెబ్బతింటే.. ఇసుకనేమైనా మేం బుక్కుతున్నామా? ఇసుకను వండుకొని బిర్యానీ తింటున్నామా? వారి దోపిడీని అడ్డుకొని, ఇసుక ఆదాయాన్ని పెంచితే.. మా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే అక్కసుతోనే మంత్రిపై ఆరోపణలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. మానసికంగా ఒత్తిడి చేసి భూములను రాయించుకోవాలనుకునే ఇలాంటి పప్పులు ఉడకవు. వీళ్లు నిజనిర్ధారణ కమిటీ అని అక్కడికెళ్లి వీరంగం చేసినప్పుడే.. ఆ కంపెనీలో తనకు, తన కుటుంబానికి సంబంధం లేదని మంత్రే స్వయంగా స్పష్టం చేశారు. సొంత అన్నదమ్ములకే ఆదాయాలు, పంపకాల్లో తేడాలు వస్తున్నాయి. అంతెందుకు? కల్వకుంట్ల తారక రామారావు, కల్వకుంట్ల కవితారావు.. వీరిద్దరూ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పిల్లలే కదా? ఆదాయ పంపకాల్లో తేడాలొస్తే.. సొంత చెల్లినే ఇంట్లో నుంచి, పార్టీ నుంచి బయటకు పంపించారు. సొంత అన్నాచెల్లెళ్లకే ఆస్తి తగాదాలుంటే.. పొంగులేటి బంధువులకో, ఎవరికో వ్యాపారాలుంటే.. పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఏం సంబంధం? ఇలాంటి చర్యలతో మీకు ఎలాంటి ప్రయోజనం ఉండదు" అని స్పష్టంచేశారు.

# మూసీ ప్రక్షాళనకు అడ్డుపడితే శివతాండవమే

హైదరాబాద్:

ఓట్లు.. నోట్ల కోసం మూసీ నదిని అభివృద్ధి చేయడం లేదని, ఈ(ఓంకారేశ్వర) దేవాలయాన్ని చూపించి ఒక్క ఓటు కూడా అడగమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరైనా మూసీ ప్రక్షాళన అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ప్రభుత్వం శివతాండవం చేస్తుందంటూ హెచ్చరించారు. ఈశ్వరుడి ఆశీర్వాదంతోనే ఆలయ నిర్మాణం జరుగుతోందన్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో ఉస్మాన్‌సాగర్ దిగువనున్న వీరభద్రస్వామి-మచిలేశ్వర దేవాలయం గుట్టపై నూతన ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. తొలుత గుట్టపై ఉన్న దేవాలయాల్లో పూజలు చేసి, పక్కనున్న గోశాలలో గోపూజ నిర్వహించారు. మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి వద్ద ప్రభుత్వం ఆధ్వర్యంలో 99 ఎకరాల్లో రూ.157 కోట్లతో నిర్మించదలచిన గోశాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ.. "మచిలేశ్వర ఆలయానికి 1400 సంవత్సరాల చరిత్ర ఉంది. ఎంతో మంది యోగులు ఈ గుట్టపై తపస్సు చేశారు. పవిత్రమైన నేలపై ప్రస్తుతమున్న దేవాలయాలను పునరుద్ధరించుకోవడంతోపాటు.. పక్కనున్న 8 ఎకరాల్లో రూ.700 కోట్లతో అద్భుతమైన శివాలయాన్ని నిర్మిస్తున్నాం. కాకతీయుల కళా వైభవాన్ని చాటిచెప్పే.. రామప్ప దేవాలయం తరహాలో ఈ గుడి నిర్మాణం ఉంటుంది. దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం.

నిత్యం మంచినీటి ప్రవాహం ఉండేలా..

మూసీ పునరుజ్జీవంపై ఎన్ని విమర్శలొచ్చినా, అడ్డంకులు ఎదురైనా ముందుకు సాగిపోవాలని ఉప ముఖ్యమంత్రి నాకు మద్దతు తెలిపారు. మొదటి అడుగుగా ఓంకారేశ్వర ఆలయానికి శంకుస్థాపన చేశాం. దీన్ని దక్షిణ కాశీగా అభివృద్ధి చేస్తాం. తర్వాత ముస్లింల కోసం పురానాపూల్ వద్ద మక్కా మసీదులాంటి భారీ ప్రార్థనాలయాన్ని కడతాం. సిక్కుల కోసం స్వర్ణ దేవాలయం తరహాలో గౌలిగూడలో గురుద్వార్‌ను నిర్మిస్తాం. క్రైస్తవుల కోసం ఉప్పల్-నాగోల్ ప్రాంతంలో మెదక్ చర్చిని ప్రతిబింబించే ప్రార్థనాలయాన్ని నెలకొల్పుతాం. మూసీలో కలుస్తున్న కోటిన్నర మంది విసర్జకాలు, పశువుల కళేబరాలు, పరిశ్రమలు వదిలే కాలుష్య జలాలతో నగరవాసులతోపాటు నల్గొండ జిల్లా వరకు ఉన్న అనేక గ్రామాలు శిక్ష అనుభవిస్తున్నాయి. పుట్టే పిల్లలైనా మంచిగా బతకాలని యువ జంటలను గ్రామాల నుంచి బయటకు పంపిస్తున్నారు. అందుకే.. బాధిత నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులంతా మూసీ అభివృద్ధికి మద్దతిస్తున్నారు. ఎంత ఖర్చయినా, ఎన్ని సమస్యలు ఎదురైనా పనులను పూర్తి చేసి తీరతాం. గోదావరి నుంచి నగరానికి 20 టీఎంసీల నీటిని తీసుకొచ్చే పనులు 8 నెలలుగా జరుగుతున్నాయి. అందులోని ఐదు టీఎంసీల నీటిని జంట జలాశయాల నుంచి మూసీ, ఈసా నదుల్లోకి వదులుతూ.. నిత్యం మూసీలో మంచి నీటి ప్రవాహం ఉండేట్టు చర్యలు తీసుకుంటాం.

మీకు ఇంకా ప్రజాప్రతినిధులుగా కొనసాగే హక్కుందా?

ఓ అక్క ఉంది. 45 ఏళ్లుగా ఆమె కుటుంబం రాజకీయాల్లో అనేక పదవులు అనుభవిస్తోంది. ఇప్పుడు ఆమె కొడుకు మూసీ పనులను అడ్డుకునేందుకు జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ)లో కేసు వేశాడు. మీకు ఇంకా ప్రజాప్రతినిధులుగా కొనసాగే హక్కుందా? నాకూ వాళ్ల కుటుంబంతో సాన్నిహిత్యం



ఉండేది. ఆమె అప్పట్లో ఇలా లేకుండె. సావాస దోషం వల్ల మారిపోయారు. ఈ వేదిక నుంచి ఆమెకు విజ్ఞప్తి చేస్తున్నా. ఎన్జీటీ కేసును వెనక్కి తీసుకోవాలి. లేదంటే ఈ ప్రాంత ప్రజలే మిమ్మల్ని బహిష్కరిస్తారు. మీ వెనుక ముసుగు వేసుకుని ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పని చేస్తున్న వారికీ అదే పరిస్థితి" అని సీఎం పరోక్షంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, భారాస నేతలను ఉద్దేశించి విమర్శలు చేశారు. కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, నవీన్‌యాదవ్, అనిల్‌కుమార్‌రెడ్డి, సీఎస్ కె.రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా సముద్రాల ఒడ్డున ఉన్న నగరాలు ఎంతో అభివృద్ధి చెందాయి. మనకు సముద్ర తీరం లేదు. నదులనూ సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం. తరాలు నష్టపోయాయి. ఇలాగే ఉంటే హైదరాబాద్ కనుమరుగవుతుంది. దిల్లీనే అందుకు ఉదాహరణ. ప్రధాని, రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు నివాసం ఉండే ప్రాంతంలో కాలుష్యం ఎక్కువగా ఉంది. యమునా నదిలో భరించలేని దుర్వాసన. గాలి పీల్చలేని పరిస్థితులతో దిల్లీ ప్రభుత్వం సెలవులు ప్రకటిస్తోంది. హైదరాబాద్‌లో అలా జరగొద్దనే.. మూసీ నదిని పర్యాటకంగా, సంపదను సృష్టించే జీవనాడిగా, మత సామరస్యానికి ప్రతీకగా అభివృద్ధి చేస్తున్నాం.

అదిగో ఆధునిక గోశాల .. నగర శివారులోని ఎన్కేపల్లి గ్రామంలో ఆధునిక గోశాల నిర్మాణం షురూ కానుంది. రూ.157 కోట్లతో హెచ్ఎండీఏ ఈ ప్రాజెక్టు చేపడుతోంది. ఏడాదిలో పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఒక్కో షెడ్డులో 100 ఆవులు ఉండేలా 10 ఆధునిక షెడ్లు, షవర్‌తో కూడిన వాషింగ్ టన్నెళ్లు నిర్మిస్తారు. 54 ఎకరాల్లో డ్రిప్ విధానంలో పచ్చగడ్డి, ఇతర పశుమేత పెంపకం చేపడతారు. పశు వైద్యశాల నిర్మించనున్నారు. అక్కడ పనిచేసే వైద్యులు, స్టాఫ్, పారామెడికల్, ఇతర పనివారికి క్వార్టర్లు నిర్మిస్తారు. నెయ్యి తయారీ యూనిట్లు.. గోబర్ గ్యాస్ యూనిట్, 3 నుంచి 4 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్లు.. ఇలా సకల వసతులు గోశాలలో కల్పించనున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత నిర్వహణ బాధ్యతను పశుసంవర్ధక శాఖకు అప్పగిస్తారు. గోపూజ కోసం ప్రత్యేకంగా టెంపుల్ కాంప్లెక్స్ నిర్మిస్తారు.

# రాఘవ కన్‌స్ట్రక్షన్స్ బరితెగింపు..

హైదరాబాద్, మార్చి 28 :

ఎలాంటి అనుమతులు లేకుండానే జీవో 111 పరిధిలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ భారీ స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసిందని, డీజిల్ జనరేటర్లపై నడుపుతూ నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా అక్రమ దందా కొనసాగిస్తున్నదని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీనిపై విపక్ష సభ్యులతో హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని, లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శనివారం శాసనసభలో మైనింగ్ శాఖ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ మైనింగ్ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణం జరుగుతున్నదని, దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నదని తెలిపారు. అక్రమ మైనింగ్ యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నదని పేర్కొంటూ పలు ఆధారాలు, అధికారులు ఇచ్చిన నోటీసులను సభ ముందుంచారు. గనుల శాఖ అనేది ప్రభుత్వానికి నాన్-టాక్స్ రెవెన్యూ తెచ్చిపెట్టే అత్యంత కీలకమైన శాఖ అని, ఇలాంటి శాఖలో అధికారులు, ప్రభుత్వం ఎంత జాగ్రత్తగా పనిచేస్తే ఖజానాకు అంత ఆదాయం వస్తుందని, ఆ నిధులతో అభివృద్ధి, సంక్షేమం చేపట్టవచ్చని తెలిపారు. కానీ ఇవాళ మైనింగ్ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణం జరుగుతున్నదని, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నదని, రాష్ట్ర ఆదాయానికి తూట్లు పడొద్దు అన్నదే తమ తపన అని చెప్పారు. హైదరాబాద్ నడిబొడ్డున, నగరాన్ని ఆనుకునే పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ వ్యాపారాలు జరుగుతున్నాయని వివరించారు. 'రాజ్యాంగం మీద ప్రమాణం చేసి వచ్చిన మనందరికీ రాష్ట్ర వనరులను కాపాడే బాధ్యత ఉన్నది. జీవో 111ను ఉల్లంఘిస్తూ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ దందా కొనసాగిస్తున్నది. నిబంధనలు పాటించకుండా, అనుమతులు సైతం లేకుండానే దర్జాగా దందా చేస్తున్నది. నిబంధనల ప్రకారం జీవో111 పరిధిలోని శంషాబాద్ మండలం కోత్వాల్ గూడలో (సర్వే నంబర్ 62, 63) ఎలాంటి కాలుష్య పరిశ్రమలు పెట్టకూడదు.

కానీ అకడ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ భారీ స్టోన్ క్రషర్‌ను డీజిల్ జనరేటర్లపై ఇష్టారాజ్యంగా నడుపుతున్నది. ఈ ప్రభుత్వం తెచ్చిన జీవో 26 (స్టోన్ క్రషర్ రూల్స్ 2026) ప్రకారం, స్టోన్ క్రషర్ పెట్టాలంటే మినరల్ డీలర్ లైసెన్స్ (ఎండీఎల్) ఉండాలి. పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నుంచి సీఎఫ్ఈ (కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్), సీఎఫ్‌వో (కన్సెంట్ ఆఫ్ ఆపరేషన్) సర్టిఫికెట్లు తీసుకోవాలి. ఇందులో ఏ ఒక నిబంధన కూడా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పాటించలేదు. రాఘవా కన్‌స్ట్రక్షన్స్‌కు ఎండీఎల్ లైసెన్స్ కానీ, సీఎఫ్ఈ, సీఎఫ్‌వో సర్టిఫికెట్లు కానీ లేవు. రిజిస్ట్రేషన్ కూడా లేదు. విద్యుత్తు కనెక్షన్ లేకుండా డీజిల్ జనరేటర్ల మీద క్రషర్ నడుపుతున్నారు. కరెంట్ కనెక్షన్ తీసుకోవాలంటే ఈ అనుమతులన్నీ ఉండా లి. అవి లేనందున డీజిల్ జనరేటర్లతో క్రషింగ్ చేస్తున్నారు' అని ఆధారాలతో వివరించారు.రాష్ట్ర వార్తలు

ప్రభుత్వం ఎందుకు మౌనం?

ఈ దారుణమైన దోపిడీని క్రోనాలజీ ప్రకారం సభ ముందు పెడుతున్నట్టు హరీశ్ పేర్కొన్నారు.'2025, మే 21న మైనింగ్ శాఖ డైరెక్టర్ జనరల్ స్వయంగా ఈ క్రషర్‌పై తనిఖీకి ఆదేశించగా రెవెన్యూ, పీసీబీ, ఎన్పీడీసీఎల్, మైనింగ్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు చేసి 5,130 మెట్రిక్ టన్నుల అక్రమ రఫ్ స్టోన్ నిల్వలు పట్టుకున్నారు. 2026, ఫిబ్రవరి 13న డిమాండ్ నోటీసుకు ఆదేశించారు. కానీ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పట్టించుకోలేదు. 2026, మార్చి 4న మళ్లీ తనిఖీ చేయగా ఏకంగా 11,200 మెట్రిక్ టన్నుల ముడి సరుకు దొరికింది. 2026, మార్చి 13న మరో షోకాజ్ నోటీస్ (నం-788) ఇచ్చారు. 2026, మార్చి 5న ఎలాంటి అనుమతులు లేకుండా డీజిల్ జనరేటర్‌పై స్టోన్ క్రషర్ నడుపుతున్నారు, కాలుష్యానికి పాల్పడుతున్నారని పేర్కొంటూ స్వయంగా మైనింగ్ అధికారులే పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లేఖ రాశారు. మైనింగ్ చట్టం ప్రకారం.. ఎండీఎల్ లైసెన్స్ లేకుండా క్వారీ చేస్తే మొదటిసారి రూ.10,000, రెండోసారి కూడా పట్టుబడితే రూ.25 వేల జరిమానాతో పాటు ఏడాది కఠిన కారాగార శిక్ష విధించాలి. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ రెండు సార్లు పట్టుబడింది. మరి ఎందుకు ఈ ప్రభుత్వం మౌనంగా ఉన్నది? ఆ కంపెనీపై ఎందుకింత ప్రేమ? ఇప్పటివరకు మీరు తీసుకున్న కఠిన చర్యలు ఏమిటో సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

ప్రతిపక్షానికో న్యాయం.. మంత్రులకో న్యాయమా?

పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తమ్ముడి స్టోన్ క్రషర్‌లో చిన్న తప్పు జరిగిందని ఆయనను రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి నెల రోజులు జైల్లో పెట్టారని హరీశ్‌రావు గుర్తుచేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ విషయంలో మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ప్రతిపక్షానికి ఒక న్యాయం, అధికార పార్టీ మంత్రులకు ఒక న్యాయం ఉంటుందా? అని ప్రశ్నించారు.

హౌస్ కమిటీ వేయండి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓబులాపురం మైన్స్‌పై ఆరోపణలు వస్తే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హౌస్ కమిటీ వేసి, ఆరోపణలు చేసిన నాగం జనార్దన్‌రెడ్డినే కమిటీకి చైర్మన్‌గా వేశారని హరీశ్ గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అలానే హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. 'నేను ముఖ్యమంత్రికి, ఈ ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నా.. మీ దగ్గర నిజాయితీ ఉంటే.. ఈ కుంభకోణంతో మీకు సంబంధం లేకపోతే.. ప్రతిపక్ష సభ్యులతో హౌస్ కమిటీ వేయండి. లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మాకు ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదు. ఆయన గతంలో మాతో కలిసి పనిచేసిండ్రు. కానీ, తప్పు జరిగినప్పుడు.. ఆ తప్పును ఆధారాలతో సహా బయటకు తీయడం, రాష్ట్ర ఖజానాను కాపాడటం ప్రతిపక్షంగా మా బాధ్యత' అని వివరించారు.

నేను చెప్పింది తప్పయితే ఉరి తీయండి

హరీశ్ మాట్లాడుతుండగా మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ 'వ్యక్తిని, కంపెనీని లక్ష్యంగా చేసుకొని అప్రదిష్టపాలు చేసేలా మాట్లాడటం సరికాదు' అని పేర్కొన్నారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ 'నేను అసత్య ఆరోపణలు చేస్తే నన్ను ఉరి తీయండి.. శాసన సభ్యుడిగా సస్పెండ్ చేయండి' అని సవాల్ విసిరారు. అదే సమయంలో తాను చెప్పింది నిజమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారిక డాక్యుమెంట్లు, డేటా ఆధారంగా తాను మాట్లాడుతున్నట్టు చెప్పారు. స్టోన్ క్రషర్‌లో చిన్న పొరపాటు జరిగిందనే కారణంతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తమ్ముడిని నెలరోజులు జైల్లో పెట్టారని పేర్కొంటూ, ప్రతిపక్షానికి ఒక న్యాయం, అధికార పక్షానికి మరో న్యాయం ఉంటుందా? అని నిలదీశారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని సూచించారు. 'నేను చేస్తున్నది ఆరోపణలు కాదు.. డిపార్ట్‌మెంట్ అధికారులు ఇచ్చిన నోటీసులనే చదివి చెప్తున్నా.. ఎన్ని విచారణలు చేస్తారో చేయాలి.. కానీ, ముందుగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ సాక్షిగా సీఎం పచ్చి అబద్ధాలు

అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు మాట్లాడారని హరీశ్ నిప్పులు చెరిగారు. సభ వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మంత్రి పొంగులేటిది కాదని ముఖ్యమంత్రి చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటికి ఆయన భార్య, కొడుకు, తమ్ముడు దూరపు బంధువులు ఎలా అవుతారని ప్రశ్నించారు. రాఘవ పేరు స్వయానా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి పేరని, ఆ కంపెనీ ఆయనదేనని లోకమంతా తెలుసని చెప్పారు. పొంగులేటి సతీమణి మాధురి, కొడుకు హర్షరెడ్డి, తమ్ముడు ప్రసాద్‌రెడ్డి రాఘవ కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్లుగా ఉన్న కంపెనీ ఇతరులది ఎలా అవుతుందని ప్రశ్నించారు. అయినా అది పొంగులేటి దూరపు బంధువులదని అసెంబ్లీ సాక్షిగా పేర్కొంటూ, సీఎం అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని విమర్శించారు. సభలో కాంగ్రెస్ సరార్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని, అక్రమాలపై ప్రశ్నిస్తే డొంకతిరుగుడు సమాధానాలు చెప్తున్నదని దుయ్యబట్టారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జవాబుదారీతనం లేకుండా సభలో దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ పాలకుల తీరు శోచనీయమని వాపోయారు.

పొంగులేటి రాజీనామా చేయాలి

'రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఏం సంబంధం? అని మైనింగ్ శాఖ మంత్రి అడుగుతున్నారు. గతంలో ఇదే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై మేము ట్విట్టర్‌లో పెడితే మంత్రి పొంగులేటి ప్రెస్ మీట్ పెట్టి 'నాపై మొరిగే కుకలను గొలుసు కట్టి ఎలా కట్టేయాలో మాకు బాగా తెలుసు' అన్నారు. ఆయనకేం సంబంధం లేకపోతే ఎందుకు భుజాలు తడుముకున్నారు?' అని హరీశ్ ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి తక్షణమే నైతికంగా రాజీనామా చేసి విచారణ ఎదురోవాలని డిమాండ్ చేశారు. 'నిన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ 'గత ప్రభుత్వంలో తప్పులు జరిగాయి.. మేం చేస్తే తప్పేంటి?' అన్నట్టు మాట్లాడారు. ఏ ప్రభుత్వమైనా తప్పు చేయడానికి వీల్లేదు. మీరు అధికారంలో ఉన్నరు. కాళేశ్వరం కమిషన్ వేసిండ్రు. విద్యుత్తు కమిషన్ వేసిండ్రు. మీ చేతుల్లో అధికారం ఉన్నది. ఎంక్వయిరీ చేసుకోండి' అని తేల్చిచెప్పారు.

మూసీలో కాలుష్యం జరుగవద్దని ముఖ్యమంత్రి అంటరు. కానీ ఇకడ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వల్ల మూసీ నది, గండిపేట్, హిమాయత్‌సాగర్ కాలుష్యమవుతున్నయని మైనింగ్ అధికారులే లిఖిత పూర్వకంగా రాసిచ్చిండ్రు. దీనిపై ముఖ్యమంత్రి ఏం సమాధానం చెప్తరు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఏం సంబంధమని మైనింగ్ శాఖ మంత్రి అడుగుతున్నరు. గతంలో ఇదే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై మేం ట్విట్టర్‌లో పెడితే మంత్రి పొంగులేటి ప్రెస్ మీట్ పెట్టి 'నాపై మొరిగే కుకలను గొలుసు కట్టి ఎలా కట్టేయాలో మాకు బాగా తెలుసు' అన్నరు. ఆయనకు ఏం సంబంధం లేకపోతే ఎందుకు భుజాలు తడుముకున్నరు.

## మూసీలో లక్షన్నర కోట్ల అవినీతి!..
## కాంగ్రెస్ నడిపేది సర్కారా? రౌడీ దర్బారా?

**ప్రజలను భయపెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి**
**కాంగ్రెస్ నడిపేది సర్కారా? రౌడీ దర్బారా?**
**పిచ్చోడి చేతిలో రాయి కాదు.. రాష్ట్రమే ఉన్నది**
**ఈ శతాబ్దపు మోసం అభయహస్తం మ్యానిఫెస్టో**
**అరాచకాలను అడ్డుకునేందుకు సిద్ధంకావాలి**
**ఇంటింటికీ వెళ్లి వివరించి ప్రజల్లో చైతన్యం తేవాలి**
**బీఆర్ఎస్వీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం**

హైదరాబాద్, మార్చి 28 :

సాములపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్ బెదిరింపులకు దిగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నించిన సందర్భంలో కూడా ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణి ప్రదర్శించారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు అడిగితే విజిలెన్స్ కేసులు, ప్రతిపక్షంగా తాము నిలదీస్తే బెదిరిస్తున్నారని, కాంగ్రెస్ నడిపేది సర్కారా.. రౌడీ దర్బారా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి బెదిరింపులకు బీఆర్ఎస్ ఎప్పటికీ భయపడదని కేటీఆర్ తేల్చిచెప్పారు. మూసీ సుందరీకరణ ముసుగులో రేవంత్‌రెడ్డి చేస్తున్న భారీ కుంభకోణంపై నగర ప్రజల్లో చైతన్యం కల్పించాలని బీఆర్ఎస్వీ నేతలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ అరాచకాలను అడ్డుకునేందుకు విద్యార్థి విభాగం సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 2న ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేయాలని చెప్పారు.

ఏప్రిల్ 4నుంచి 14వరకు వరకు 50బృందాలుగా ఏర్పడి మూసీ పరీవాహక ప్రాంతాలు, బస్తీలు, గల్లీల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి మూసీ ప్రక్షాళన వెనుక ఉన్న కాంగ్రెస్ కుట్రను వివరించాలని సూచించారు. కరపత్రాలు, పోస్టర్లు, ప్రత్యేక టీషర్టులతో క్యాంపెయిన్ నిర్వహించాలని, విద్యార్థుల దెబ్బకు ప్రభుత్వం దిగొచ్చేలా ప్రజల్లో చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో శనివారం సాయంత్రం బీఆర్ఎస్వీ హైదరాబాద్ నగర నేతలతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. వేల ఇండ్లు కూలగొట్టిన వ్యక్తిగా చరిత్రలో మిగిలిపోతావో.. లేక పద్ధతి మార్చుకుంటావో తేల్చుకో రేవంత్‌రెడ్డి అని హితవు పలికారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేసింది ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు కోసం మాత్రమేనని, పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోవడానికి కాదని స్పష్టంచేశారు.

పిచ్చోడిచేతిలో రాష్ట్రం

'పిచ్చోడు కనిపిస్తే దూరంగా వెళ్తాం. అతడి చేతిలో రాయి ఉంటే ఇంకా దూరం వెళ్తాం. కానీ, రేవంత్‌రెడ్డి అనే పిచ్చోడి చేతిలో రాయి కాదు.. ఇప్పుడు రాష్ట్రమే ఉన్నది' అని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తం.. మెగా డీఎస్సీ వేస్తం.. యువతలకు స్కూటీలు ఇస్తం.. విద్యార్థులకు భరోసా కార్డు ఇస్తం.. ఇలా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం మ్యానిఫెస్టో.. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసమని మండిపడ్డారు. ఒక్క విద్యార్థులను, నిరుద్యోగులనే కాదు రైతు భరోసా, రుణమాఫీ, కౌలు రైతులకు ఏడాది రూ.15 వేలు ఇస్తామని రైతులను సైతం బురిడీ కొట్టించారని విమర్శించారు.

మంత్రులు.. కమల్‌హాసన్‌ను మించిపోయారు

కాంగ్రెస్ మంత్రులు కమలహాసన్ కంటే పెద్ద యాక్టర్లుగా తయారయ్యారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో గ్యారెంటీ కార్డులను 100 రోజులు భద్రంగా పెట్టుకోవాలని భట్టి ప్రజలకు సూచించారని గుర్తుచేశారు. 100 రోజులు కాదు 800 రోజులు దాటాయి ఇప్పుడు ఆ కార్డులు ఎక్కడ పెట్టుకోవాలి? అని ప్రశ్నించారు. కోసినా పైసా లేదని అని చెప్పిన రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ.. నువ్వేమైన సేపువా? జమకాయవా? పిచ్చిపోయిన పుచ్చకాయవు రేవంత్‌రెడ్డీ?' అని విమర్శించారు. మూసీ ప్రాజెక్ట్‌పై అసలు ప్రణాళికలు లేకుండా, డీపీఆర్ కూడా సిద్ధం చేయకుండా అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. బఫర్ జోన్ పేరుతో పేదల ఇళ్లు కూల్చివేస్తూ, పెద్దల ఇళ్లను వదిలేస్తున్నారని, ఇది ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.

హైదరాబాద్‌ను కాపాడుకునే బాధ్యత యువతదే..

హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉన్నదని, మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల జీవితాలను నాశనం చేయడాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇళ్లు కూల్చకుండా, భూములు స్వాధీనం చేసుకోకుండా శాస్త్రీయ పద్ధతిలో మూసీ శుద్ధి చేస్తే బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం వేలాది కుటుంబాలు భయాందోళనలో ఉన్నాయని, ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భావోద్వేగ అంశమని గుర్తుచేశారు. ఇచ్చిన హామీల అమలుకు ఒక రూపాయి లేదని చెప్పే సీఎం, తన అవినీతి సొమ్ముల కోసం మూసీ పేరిట లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తానని ప్రకటించడం దారుణమని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16వేల కోట్లతో రూపొందించిన మూసీ సమగ్ర ప్రణాళికను పకన పెట్టి, భారీ అంచనాలతో అవినీతికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం మూసీ నదిలో మురుగునీటి శుద్ధి కేంద్రాల(ఎస్టీపీ) నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని మూసీలోకి పంపించే ప్రణాళిక కూడా సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. అయినా, ప్రస్తుత ప్రభుత్వం అంచనాలను అనవసరంగా పెంచి అవినీతికి బాటలు వేస్తున్నదని విమర్శించారు.

మెస్‌చార్జీలకు డబ్బులుండవు.. మూసీకి మాత్రం ఉంటయా? : సబితాఇంద్రారెడ్డి

ఫీజు రీయింబర్స్‌కు డబ్బులుండవు.. స్కాలర్‌షిప్, మెస్‌చార్జీలకు డబ్బుల్లేవు.. కానీ, మూసీ సుందరీకరణకు మాత్రం డబ్బులొస్తాయా? అని మహేశ్వరం ఎమ్మెల్యే పీ సబితాఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి దఫాలోనే పది వేల ఇండ్లు కూల్చబోతున్నారని ఆరోపించారు. ప్రాజెక్టులో ఇండ్లు కోల్పోతున్నవారికి మనోధైర్యం కల్పించాలని విద్యార్థి విభాగానికి ఆమె పిలుపునిచ్చారు. మూసీ పేరుతో జరిగే అరాచకానికి తాము వ్యతిరేకమని చెప్తున్నా.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రంగారెడ్డి జిల్లా ప్రజలు తమకు ఉన్నత స్థానాలు కల్పించారని, వారికి అండగా నిలబడటం తమ బాధ్యత అని చెప్పారు. ప్రజలకు అన్యాయం జరిగితే కోర్టుకే కాదు. ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరించారు.

మూసీ సుందరీకరణ పేరుతో లూటీ : గెల్లు శ్రీనివాస్

మూసీ సుందరీకరణ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. నాడు చంద్రబాబు నందనవనం పేరుతో తలపెట్టిన ప్రాజెక్టును ఇప్పుడు ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి మళ్లీ చేపట్టారని విమర్శించారు. బీఆర్ఎస్వీ విద్యార్థుల సమస్యలే కాదు. ప్రజాసమస్యలపైనా పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. హైదరాబాద్ లేకుండా తెలంగాణ ఇస్తే ఊరుకోబోమని ఆనాడు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టామని చెప్పారు. విద్యాశాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా రేవంత్‌రెడ్డి పనిచేయడం లేదు కానీ, హోం మంత్రి మాత్రం బాగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు.

యూనివర్సిటీలకు ఫండ్స్, గ్రామాలకు నిధుల్లేవు: గాదరి కిశోర్

రాష్ట్రంలో యూనివర్సిటీలకు ఫండ్స్ రావు, గ్రామాలకు నిధుల్లేవు కానీ, మూసీ సుందరీకరణ పేరుతో భారీ స్కామ్‌కు తెరతీశారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ ఆరోపించారు. రూ.16 వేల కోట్లతో కేసీఆర్ మొదలుపెట్టిన మూసీ అభివృద్ధి ప్రాజెక్టుతో ఏమీ మిగలదని భావించి రూ.1.50 లక్షల కోట్ల ప్రతిపాదనలతో భూదందాకు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. మూసీ సుందరీకరణతో బ్రాండ్ ఇమేజ్ ఎలా పెంచుతారో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. లక్ష మందిని రోడ్డున పడేసి సుందరీకరణ అంటే ఊరుకోమని హెచ్చరించారు. ప్రజాసమస్యలపై గొంతెత్తాలని, అంతా నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు.

జైళ్లకు పోయినా అండగా ఉంటాం:బాల్క సుమన్

'జ్ఞానం కోసం చదువు.. జనం కోసం పోరాడు' నినాదంతో బీఆర్ఎస్వీ విద్యార్థులు కదంతొక్కాలని మాజీ ఎంపీ బాల్క సుమన్ పిలుపునిచ్చారు. విద్యార్థులు పోరాడాలని, కేసులైనా, జైళ్లకు పోయినా పార్టీపరంగా అండగా ఉంటామని చెప్పారు. మూసీలో గాంధీ విగ్రహం పెట్టండి.. కానీ ప్రజలను రోడ్డున పడేయెద్దని సూచించారు. మూసీపై మేధావులు, జర్నలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. టీషర్ట్, పోస్టర్లు, డోర్ స్టిక్కర్లు సిద్ధం చేసి, 10-15 రోజులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో చైతన్యం కల్పించాలని కోరారు. హైడ్రా దుర్మార్గాలను సైతం ఎండగట్టాలని, గల్లీలో చేపట్టి ఆందోళన ఢిల్లీలో మంటలు పుట్టించాలని పిలుపునిచ్చారు.

ప్రజల పక్షాన నిలబడుతం: పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

మూసీ రివర్‌ఫ్రంట్ పేరుతో జరిగే విధ్వంసాన్ని ఆపేందుకు ఏ పోరాటానికైనా సిద్ధమేనిని బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడి తేల్చిచెప్పారు. ఇండ్లు గుంజుకుంటామంటే తాను కోర్టుకు వెళ్లానని, కోర్టుకే కాదు ఎక్కడికైనా వెళ్లి కొట్లాడుతాని తేల్చిచెప్పారు. బరాబర్ ప్రజల పక్షం నిలబడుతామని స్పష్టంచేశారు. మెట్రో ఇవ్వండి. మూసీ సుందరీకరణ వద్దు అంటూ కార్తీక్‌రెడ్డి నినదించారు. ప్రపంచంలో అన్ని రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు ఫెయిల్ అయ్యాయని విమర్శించారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు

మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షలాది ఇళ్లను కూల్చివేయడానికి, దాదాపు 3వేల ఎకరాలను సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు మూసీ ఒడ్డున ఉన్న ఇండ్లు చట్ట విరుద్ధమని చెప్పే ప్రభుత్వం, అదే ప్రాంతంలో భారీ హోటళ్లు, బిజినెస్ సెంటర్లు నిర్మించాలనుకోవడం ద్వంద్వ వైఖరి కాదా? అని ప్రశ్నించారు. మూసీ పేరిట జరుగుతున్న అవినీతి చర్యలను జాతీయ స్థాయి ప్రముఖులు వ్యతిరేకిస్తున్నారని, గాంధీ కుటుంబసభ్యులు సైతం దీనిపై అభ్యంతరం వ్యక్తంచేశారని గుర్తుచేశారు. తాను చేస్తున్న అవినీతి ప్రశ్నిస్తే శివతాండవం చేస్తా అంటూ సీఎం మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తన అధికార అహంకారాన్ని తగ్గించుకొని, మూసీ ప్రాజెక్ట్‌ను ప్రజలకు ఇబ్బంది కలగకుండా అమలు చేయాలని, లేదంటే లక్షలాది ఇళ్లను కూల్చిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం చేపట్టే పోరాటానికి పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. 'హైదరాబాద్ మీది... భవిష్యత్తు మీది. రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్టు చేస్తనంటే ఊరుకుందామా? విద్యార్థుల సత్తా ఏమిటో కాంగ్రెస్ సర్కారుకు చూపించాలి. ప్రభుత్వం వణకాలి. బీఆర్ఎస్వీ చైతన్య కార్యక్రమాలతో ప్రభుత్వ దెబ్బకు దిగిరావాలి' అని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, నాయకులు కిశోర్‌గౌడ్, చిరుమళ్ల రాకేశ్, శుభప్రద్‌పటేల్, బమ్మెర రామ్మూర్తి, పడాల సతీశ్, తుంగ బాలు, కడారి స్వామియాదవ్, శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు.

